క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకుడు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, అష్టోత్తరం, స్తోత్రపారాయణం చేశారు.

సన్మానం



సరోజమ్మను సన్మానిస్తున్న కేడీసీసీ ఉద్యోగులు

నందికొట్కూరు: పట్టణంలోని కేడీసీసీ బ్యాంక్‌లో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై కర్నూలు బ్యాంక్‌కు వెళ్లిన చీఫ్ మేనేజర్ సరోజమ్మను అధికారులు, సీఈఓలు, సిబ్బంది, ఖాతాదారులు, డైలీ డిపాజిట్ ఏజెంట్లు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. అదేవిధంగా బ్యాంక్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటరమణకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా కో ఆపరేటివ్ అధికారి శ్రీనివాసులు, బ్యాంకు మేనేజరు పులిరాజు, సీఈఓ ఖాజామొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు



సున్నిపెంటలోని దుకాణంలో సోదాలు చేస్తున్న అటవీ అధికారులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ పదార్థాలను వినియోగించొద్దని అటవీశాఖ అధికారులు కొద్ది నెలలుగా విస్తృత స్థాయి ప్రచారంతో పాటు దాడులు కూడా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం సున్నిపెంటలోని పలు దుకాణాల్లో తనిఖీలు చేశారు. దుకాణాలలో విక్రయాలకు ఉంచిన ప్లాస్టిక్ సంబంధిత వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ట్రైనీ ఐఎఫ్ఎస్ శివకుమార్, రేంజ్ అధికారి నరసింహులు, బీట్ ఆఫీసర్ రవీంద్రనాథ్ ఠాగూర్ పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నరసారెడ్డి

వెలుగోడు: మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా.. ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలని జెడ్పీ ముఖ్య కార్యనిర్వాహణాధికారి జి.నరసారెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు తనిఖీ చేసి సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి ప్రభుత్వ పథకాల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. జెడ్పీ ఏఓ మురళీకృష్ణారెడ్డి, ఏఓ ఉమర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సత్కారం



డాక్టరేట్ పొందిన తలత్ పర్వీన్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నందికొట్కూరు: డాక్టరేట్ పొందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకురాలు తలత్ పర్వీన్‌ను మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, అధ్యాపకులు పరిమళాదేవి తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అధ్యాపకులు డాక్టరేట్ సంపాదించి తమ విజ్ఞానంతో విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

ఆత్మకూరు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకుడు రాబిన్‌సన్ మాదిగ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆత్మకూరులో ఆయన మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉందని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో మాదిగలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఎన్నో ఏళ్ల పోరాటానికి తగిన ఫలితం దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

● మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అధైర్య పడవద్దని, ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి భరోసా ఇచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఓటమి చవిచూడడం వల్ల కార్యకర్తలు కొంత నిరాశ నిస్పృహలకు గురయ్యారని, ఇదంతా తాత్కాలికమని చెప్పారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు రెండుమూడేళ్లు ఓపిగ్గా ఉండాలన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని తెలిపారు. కార్యకర్తలెవరూ దుశ్చర్యలకు పాల్పడవద్దని, ప్రశాంతంగా జీవించాలన్నారు. ప్రతి రోజూ కార్యకర్తలతో అందుబాటులో ఉంటానని.. సహాయ సహకారాలు అందిస్తానన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ, మండలాధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్, శ్రీపతిరావుపేట రాజు, హనుమంతరెడ్డి, శివశంకర్‌నాయక్, సుల్తాన్, వెంకటసుబ్బయ్య, సుబ్బారెడ్డి, నల్లగాల సుబ్బారెడ్డి, సురేష్, హనుమంతరెడ్డి, మౌలాలి, మురళీధర్‌రెడ్డి, జయకృష్ణ పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా

వెలుగోడు: నియోజకవర్గంలో ఏ కార్యకర్తకు కష్టమొచ్చినా తాను అండగా నిలుస్తానని వైఎస్సార్ సీపీ శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి భరోసా కల్పించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. టీడీపీ నాయకుల బెదిరింపులకు ఎవరూ భయపడొద్దన్నారు. క్షేత్ర స్థాయిలో ఏ సమస్య వచ్చినా మండల నాయకుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, సానుభూతి పరులే లక్ష్యంగా టీడీపీ నేతలు దుర్మార్గాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, అండగా ఉండి పోరాడుతానని తెలిపారు. పార్టీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, నాయకులు దేశం తిరుపంరెడ్డి, ఇలియాస్ ఖాన్, నందిరెడ్డిగారి రామిరెడ్డి, నసిరుల్లాఖాన్, వంగాల నాగేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ శంకర్‌నాయక్, ఎంపీటీసీ సభ్యుడు రాజేష్, సర్పంచ్ జయపాల్, జబివుల్లా, నాగేశ్వరరెడ్డి, గోవిందు పాల్గొన్నారు.

శనగల బసవన్నకు ప్రత్యేక పూజలు



బయలు వీరభద్రస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు



శనగల బసవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని శనగల బసవన్న (నందీశ్వరుడు), బయలువీరభద్రస్వామి వారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడైన వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. గణపతి పూజ అనంతరం నందీశ్వరస్వామికి వస్త్ర సమర్పణ, విశేషార్చనలు, నానబెట్టిన శనగలు, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు ఇచ్చారు.

కరువు మండలంగా ప్రకటించాలి



తహసీల్దార్ ఉమారాణికి వినతి పత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

కొత్తపల్లి: కరువు మండలంగా కొత్తపల్లిని ప్రకటించాలని సీపీఐ మండల కార్యదర్శి కేతం వెంకటశివుడు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఉమారాణికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మొక్కజొన్న, పత్తి, వరి, మినుమ ఇతర పంటలు అధిక వర్షాల కారణంగా దెబ్బతిన్నాయన్నారు. కరువు మండలంగా ప్రకటించాలని, రైతులకు తక్షణమే పంటనష్టపరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు భీముడు, ఓబులేసు, బాలకృష్ణ, ఐస్వామి, లింగమయ్య, లింగస్వామి, బాలు, గోవిందు, జయరాం, వెంకటలింగం, శివన్న, రత్నం, నరసింహులు యాదవ్, సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి



కామ్రేడ్ చంద్రపుల్లారెడ్డి స్థూపం వద్ద జోహార్లర్పిస్తున్న నాయకులు

పాములపాడు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి వ్యతిరేకంగా నల్లచట్టాలు తెస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దళితులు ఐకమత్యంతో ఉద్యమించాలని సీపీఐఎం న్యూ డెక్రమోసీ డివిజన్ నాయకుడు లాజరస్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని వేంపెంట గ్రామంలోని కామ్రేడ్ చంద్రపుల్లారెడ్డి స్థూపం వద్ద సీనియర్ నాయకుడు ఆనందరావు అధ్యక్షతన చుండూరు కారంచెడు, వేంపెంట ఘటన మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1991 నుంచి 1997 మధ్య పాలక ప్రభుత్వాలు సాగించిన మారణ హోమానికి నిదర్శనమే కారంచేడు, వేంపెంట సంఘటనలన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో ప్రత్యేక రిజర్వేషన్‌లు కల్పించి ప్రాథమిక హక్కులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, విశ్వనాథం, రామసుబ్బయ్య తదితరులు ఉన్నారు.

రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



గుమ్మడాపురంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న నాయకులు

కొత్తపల్లి: వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని గుమ్మడాపురం రైతులతో కలిసి మంగళవారం దెబ్బతిన్న పంట పొలాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల మూలంగా మొక్కజొన్నతో ఇతర పంటలు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. నష్టపోయిన పంటల వివరాలను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాలని డిమాండ్ చేశారు. కొత్తపల్లి మండలంలో 3,729 హెక్టార్లలో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారని, జూలైలో ఎడతెరిపివ్వకుండా కురిసిన వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు వీరన్న, గోపాల్, నందికుంట గ్రామం రైతులు పి పెద్ద పుల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, బొమ్మన గోవిందరెడ్డి, పుల్లయ్య, రాము, పార్వతమ్మ, సుజాత, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు



నందికుంట సమీపంలోని మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపల్లి: సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించొచ్చని ఆత్మకూరు ఏడీఏ బి.ఆంజనేయ, జిల్లా వనరుల కేంద్రం వ్యసాయాధికారి హేమలత సూచించారు. మండల పరిధిలోని గువ్వలకుంట్ల మజారా గ్రామం పాలెంచెరువు గూడెంలో మంగళవారం వరిపంటలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా నందికుంట గ్రామ సమీపంలోని మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ నారు నాటేప్పుడు మొక్క కొనలు తుంచాలని, దీంతో కాండం తొలిచే పురుగు గుడ్లు నాశనం అవుతాయన్నారు. అలాగే వరి పంటలో ప్రతి రెండు మీటర్లకు 20 సెంటిమీటర్ల కాలిబాటలు తీయాలని, దీంతో గాలి ప్రసరణ బాగా జరిగి సుడిదోమ ఉధృతిని తగ్గించవచ్చున్నారు. అదేవిధంగా మొక్కజొన్న పంటలో కత్తెర పురుగును గుర్తించామని, నివారణకు ఇమామెక్టిన్, బెంజోయేట్ 80 గ్రాములు ఒక ఎకరాకు పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ మహేష్, వ్యవసాయ సహాయకులు జాహిద్, శివకృష్ణ నాయక్, రైతులు పాల్గొన్నారు.

17న సర్వసభ్య సమావేశం

మహానంది: బండిఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 17వ తేదీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయరావు తెలిపారు. ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు. ప్రాథమిక విద్య, విద్యుత్ సరఫరా, వ్యవసాయ, తదితర 23 శాఖలపై సమీక్ష ఉంటుందని, అన్నిశాఖల అధికారులు ప్రగతి నివేదికలను ముందే సమర్పించాలన్నారు.

ఇన్‌చార్జ్ ఎస్ఐగా నాగార్జునరెడ్డి

మహానంది: గోస్పాడులో విధులు నిర్వహిస్తున్న నాగార్జునరెడ్డిని మహానంది ఇన్‌చార్జ్ ఎస్ఐగా నియమిస్తూ ఉన్నతాధికారులు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. సీతారామపురంలో హత్య ఘటనతో ఎస్ఐ నాగేంద్రప్రసాద్‌ను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా కొద్ది రోజుల్లో రెగ్యులర్ ఎస్ఐని నియమించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఇద్దరు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

అయ్యన్ననగర్‌లో చిరుత!

మహానంది: మహానంది సమీపంలోని తెలుగుగంగ కాల్వ పరిసరాల్లో మంగళవారం రాత్రి చిరుత కనిపించినట్లు స్థానికులు తెలిపారు. అయ్యన్ననగర్ గ్రామ సమీపంలోని తెలుగు గంగ కాల్వ మీదుగా కృష్ణ నంది వెళ్లే మార్గంలో కట్టపై చిరుత కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురై పరుగులు తీశారు. అయ్యన్ననగర్‌లోని నాగన్న ఇంటి సమీపంలో కనిపించడంతో స్థానికులు కేకలు వేయగా పక్కనే ఉన్న పొలాల వైపు పరుగులు తీసిందన్నారు. కొద్ది రోజులుగా ప్రశాంతంగా ఉండగా మరోసారి చిరుత సంచారంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు: పట్టణంలోని పోస్టుమెట్రిక్ హాస్టల్‌లో మెనూ పాటించని వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని పీఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దక్క కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హాస్టల్‌ను సందర్శించి భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని ఆరోపించారు. విచారణ చేసి వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. పీఎస్ఎఫ్ నాయకులు దేవరాజు, కిరణ్, రాజు, అబ్దుల్లా ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

మిడుతూరు: నంద్యాల మండలం చాపిరేవుల గ్రామానికి చెందిన నాగార్జున మంగళవారం జలకనూరు బాట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలకు గురయ్యాడు. ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రాతకోట గ్రామంలో బంధువులు ఎల్లమ్మకు చేయడంతో నాగార్జున ద్విచక్రవాహనంపై వెళ్లి తిరుగు ప్రయాణం అయ్యాడు. జలకనూరు బాట వద్ద బైక్ అదుపుతప్పడంతో తీవ్రంగా గాయపడ్డాడు. నాగార్జునను చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు 108లో తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పెద్దఎత్తున పంద్రాగస్టు వేడుకలు

నంద్యాల: ఈనెల 15వ తేదీ స్వాతంత్ర్య వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలన్నారు. కళాశాల మైదానాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. జాతీయ పతాక ఆవిష్కరణ, సాయుధ దళాల మార్చ్ ఫాస్ట్, వేదిక, బ్యాక్ డ్రాప్, వీవీపీ సీటింగ్ తదితర ఏర్పాట్లపై ప్రత్యేక దొరవ చూపాలని ఆర్‌డీఓ, పోలీసు అధికారులను ఆదేశించారు. అలాగే ఆయా శాఖలు ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. వేడుకల నిర్వహణకు సంబంధించి అధికారులకు అప్పగించిన విధులను చివరి వరకు ఉండకుండా ముందుగానే పూర్తి చేసుకోవాలన్నారు.

శ్రీశైలంలో అగ్ని ప్రమాదం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని మహిషాసురమర్దిని ఆలయం పక్కనే కొబ్బరి చిప్పలకు మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో హఠాత్తుగా నిప్పు అంటుకుంది. అయితే ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదని హిందూ పరిరక్షణ సమితి సభ్యులు వెల్లడించారు. మంటలు వ్యాపించకుండా స్థానికులతో కలిసి దేవస్థానం ట్యాంకర్ తెప్పించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

మల్లన్నకు వెండి వస్తువుల కానుక



వెండి సామాన్లు అందజేస్తున్న దాత

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం దేవస్థానానికి విశాఖపట్నంకు చెందిన కె. అవినాష్, సాహిత్యశ్రీ వెండి వస్తువులను విరాళంగా సమర్పించారు. మంగళవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాతలు వీటిని వేదపండితులు గంటి రాధకష్ణ అవధాని, విజయ కుమార్, ఆలయ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునకు అందజేశారు. 200 గ్రాముల వెండి చెంబు, 200 గ్రాముల వెండిశఠారి, 595 గ్రాముల వెండి నాగ హారతి ఉన్నాయి. దాతకు వేదాశీర్వచనం పలికి స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

సిద్ధాపురానికి బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



మాట్లాడుతున్న నాగార్జున

ఆత్మకూరు: సిద్ధాపురం గ్రామానికి బస్సు సర్వీసు కల్పించాలని ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) ఆధ్వర్యంలో మంగళవారం ఆత్మకూరు డిపో మేనేజర్ మహేంద్రుడికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున మాట్లాడుతూ.. సిద్ధాపురం గ్రామం నుంచి సుమారు 150 మంది విద్యార్థులు ఆత్మకూరు పట్టణంలోని జూనియర్, డిగ్రీ కళాశాల, వెంకటాపురంలో ఉన్న హైస్కూల్‌కు చదువుకోవడానికి వెళుతుంటారని తెలిపారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అసోసియేషన్ నాయకులు రాజు, ముని, ప్రవీణ్, కిరణ్ ఉన్నారు.

రికార్డులు పక్కాగా నిర్వహించండి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ నూర్జహాన్

జూపాడుబంగ్లా: హాస్టళ్లకు సంబంధించిన రికార్డులు పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ నూర్జహాన్ వార్డెన్ ఉమాదేవికి సూచించారు. మంగళవారం ఆమె జూపాడుబంగ్లా ఎస్సీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేశారు. ముందుగా రికార్డులు, స్టాక్ నిర్వహణ పుస్తకాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే కూరగాయలు, స్టాక్ నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆమె విద్యార్థినులతో మాట్లాడి మెనూ ప్రకారంగా నాణ్యమైన భోజనం వడ్డిస్తున్నారా లేదా అని ఆరా తీశారు.

పసిపిల్లల ఆరోగ్యానికి ముర్రుపాలు సంజీవిని



నెహ్రూనగర్‌లో మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లలు



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పగిద్యాల: అప్పుడే పుట్టిన పసిపిల్లల ఆరోగ్యానికి ముర్రుపాలు సంజీవినిలా పనిచేస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శేషమ్మ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నెహ్రూనగర్ గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ చేపట్టి రెండవ సచివాలయ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాలు ముద్దు.. డబ్బా పాలు వద్దు అనే నినాదాలు చేశారు. బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని, 18 ఏళ్లు నిండాకే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయాలని నినాదాలు చేశారు. బాల్య వివాహాలు నేరమని, చేసినా ప్రోత్సహించినా శిక్షార్హులవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, స్వర్ణలత, షాజదాబేగం, సుధామణి, వెంకటేశ్వరమ్మ, రాములమ్మ, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం

మిడుతూరు: తల్లిపాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డాక్టర్ రాజు అన్నారు. మండల పరిధిలోని కడుమూరులో పీహెచ్‌సీ సిబ్బంది తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన తర్వాత అరగంటలోపు ఇచ్చే ముర్రుపాలు నవజాత శిశువులకు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుందన్నారు. తల్లిపాలు రోజుకు ఎన్ని సార్లు ఇవ్వాలి? తల్లికి, బిడ్డకు కలిగే ప్రయోజనాలు తదితర విషయాలపై తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రంగస్వామి, సూపర్‌వైజర్లు ఏసేపు, రామతులశమ్మ, ఆశా వర్కర్లు వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారులు గోపాల్

తల్లిపాలే బిడ్డకు రక్ష

ఆత్మకూరు: తల్లిపాలు బిడ్డకు అమృతంలా పనిచేస్తుందని బైర్లూటీ వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్ అన్నారు. ఆత్మకూరు మండలం బైర్లూటీలో మంగళవారం ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని తల్లులకు ముర్రుపాలు ఆవశ్యకతపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. గ్రామంలో ఏదైన ఆరోగ్య అత్యవసర పరిస్థితి ఏర్పడితే వెంటనే స్పందించి సంబంధిత ఆరోగ్య కార్యకర్తలకు, వైద్యాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఖుద్దూష్, హెల్త్ సూపర్‌వైజర్ రవణమ్మ, సీహెచ్‌ఓలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు



ఆత్మకూరు: ఆత్మకూరు పురపాలక సంఘం పరిధిలో పనిచేయని విద్యుత్ దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసినట్లు కో-ఆప్షన్ సభ్యుడు ఎం.ఎ.రషీద్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న విద్యుత్ స్తంభాలను మైనర్ రిపేర్లు చేయించారు. స్తంభాలు లేని ప్రాంతంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. మున్సిపల్ ఏఈ బాషా, ఎల్ఐసీ కరీం, అసిస్టెంట్ ఇంజనీర్ విభాగం వర్క్ ఇన్‌స్పెక్టర్ మురహరి రాజేష్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం



హాస్పిటల్‌లో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

మిడుతూరు: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మంగళవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సర్పంచ్ జయలక్ష్మమ్మ అధ్యక్షతన అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ముందుగా రోగులకు అందుతున్న వైద్య సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్‌లో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న వారు ఉంటే రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడ జీతం తీసుకుంటే అక్కడే విధులు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగావతి, సీహెచ్‌సీ మెడికల్ అధికారి, చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ తిరుపతి, డాక్టర్ భరత్ కుమార్, డాక్టర్ శారద, డాక్టర్ సాయిసుధ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్యామలమ్మ, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి, వంగాల శివరామిరెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

స్థానిక ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం రుచి చూసిన ఎమ్మెల్యే నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలలో నీటి సమస్య, రహదారి సమస్య ఉందని ప్రిన్సిపాల్ సలీంబాషా అధ్యాపకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించినప్పుడే గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న గురుకుల పాఠశాలల డీసీఓ శ్రీదేవి

జూపాడుబంగ్లా: ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని అంబేడ్కర్ గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి తెలిపారు. జూపాడుబంగ్లా గురుకుల పాఠశాలలో లైబ్రేరియన్‌గా విధులు నిర్వహిస్తున్న సీఏ కంబయ్య పదవీ విరమణ పొందారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం కంబయ్య దంపతులకు శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించారు. డీసీఓ శ్రీదేవితోపాటు ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి న్న సీఏ కంబయ్య సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరప్ప, లక్ష్మాపురం, దిన్నెదేవరపాడు, బెళగల్, అరికెర ప్రిన్సిపాళ్లు రమణమ్మ, అరుణకుమారి, బలరాముడు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.